సాక్షి అనంతపురం

గురువారం । 4 । జూలై । 2024



స్థిరంగా చీనీ ధర

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.34

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.34 పలికింది.

గరిష్టం/కనిష్టం

35.9°/24.2°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాం @ 8.782 టీంఎసీలు



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)లో నీటి నిల్వ 8.782 టీంఎసీలకు చేరింది. డ్యాంకు ఇన్‌ఫ్లో హెచ్చు తగ్గుల మధ్య కొనసాగుతోంది. గత సోమవారం 11,854 క్యూసెక్కులు, మంగళవారం 13,410 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం ఉదయానికి 10,503 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం డ్యాం నుంచి 296 క్యూసెక్కుల నీరు వదలుతున్నారు. డ్యాంలో 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,587.11 అడుగులకు నీరు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.782 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 1,576.5 అడుగుల నీరు ఉండింది. 190 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండి 260 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

ముగిసిన కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. నార్పల బీసీ గురుకుల పాఠశాలలో తొలిరోజు బాలురకు, రెండోరోజు బాలికలకు మెరిట్ జాబితా మేరకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఆయా తరగతుల్లో మొత్తం 63 సీట్లకు గాను 1:2 నిష్పత్తిలో 126 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించారు. బీసీ గురుకుల పాఠశాలల జోనల్-4 ఆఫీసర్ రాజేంద్ర కుమార్ రెడ్డి, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ సంగీత కుమారి ఆధ్వర్యంలో ఈ కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని బీసీ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

అందుబాటులోకి సీటీ స్కాన్ సేవలు



సీటీ స్కాన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం కింద ఎస్ఎల్ డయాగ్నస్టిక్స్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ మిషన్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 16 స్లైస్ మిషన్ ఉండేదని, ఇప్పుడు అధునాతన 32 స్లైస్ సిమన్స్ కంపెనీ మిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. రోగులకు త్వరగా స్కాన్ తీయడంతో పాటు కచ్చితమైన నివేదికలు వస్తాయన్నారు. సర్వజనాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సురేష్, రేడియాలజిస్టు డాక్టర్ రాజేంద్రనాయుడు, డాక్టర్ మనోరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- కటకటాల్లోకి నిందితుడు



శెట్టూరు: పెన్షన్ సొమ్ము స్వాహా చేసిన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఎస్. మల్లికార్జున వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ సచివాలయ పరిధిలోని కొంతమంది పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం విడుదల చేసిన రూ. 5,45,000 నగదును వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నారు. దీనిపై పలువురి ఫిర్యాదుతో మండల అధికారులు రంగంలోకి దిగారు. మల్లికార్జునను విచారించారు. నేరం నిర్ధారణ కావడంతో కలెక్టర్‌కు నివేదిక పంపారు. సీరియస్ అయిన ఆయన మల్లికార్జునను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఈ విషయంపై ఎంపీడీఓ నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాంభూపాల్ కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినియోగదారులకు షాక్

- గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే యాప్‌ల ద్వారా కరెంటు బిల్లుల చెల్లింపునకు నో
- ఈ నెల నుంచి ఆర్బీఐ కొత్త నిబంధన
- ఇకపై ఏపీఎస్పీడీసీఎల్ యాప్ లేదా సంస్థ వెబ్‌సైట్ ద్వారానే సేవలు

గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే యాప్‌ల ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించడం ఇకపై కుదరదు. విద్యుత్ సంస్థ ప్రవేశపెట్టిన ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా కానీ లేదా సంస్థ వెబ్‌సైట్‌లోకి వెళ్లి కానీ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఆర్బీఐ తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధనతో వినియోగదారులకు షాక్ తగిలినట్లు అయింది.

తాడిపత్రి రూరల్: గతంలో విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు గంటల తరబడి క్యూలలో వినియోగదారులు వేచి ఉండాల్సి వచ్చేది. క్యూల్లో నిలబడలేని వారికి బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగేది. దీంతో అలాంటి వారు జరిమానాతో కలిపి బిల్లు చెల్లించాల్సి వచ్చేది. ఈ దుస్థితిని పారదోలుతూ, మారిన సాంకేతికతకు అనుగుణంగా ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్ పే తదితర యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించే వెసులుబాటును విద్యుత్ సంస్థ కల్పించింది. మొదట్లో తక్కువగానే వీటి ద్వారా చెల్లింపులు జరిగినా మెల్లిగా పుంజుకున్నాయి.

75 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 లక్షలకు పైగా గృహ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. మరో రెండు నుంచి మూడు లక్షల వరకు హెచ్‌టీ సర్వీసులు, పరిశ్రమల సర్వీసులు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి నెలా రూ. 300 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు విద్యుత్తు సంస్థకు ఆదాయం సమకూరుతోంది. దాదాపు 75 శాతం వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్ పే తదితర యాప్‌ల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. 25 శాతం బయట విద్యుత్ సిబ్బంది ద్వారా కానీ, బ్యాంకుల ద్వారా కానీ బిల్లులు కడుతున్నారు.



ఆర్బీఐ కొత్త నిబంధన..

ఈ ఏడాది జూలై ఒకటి నుంచి ఆర్బీఐ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. యాప్‌ల ద్వారా చెల్లింపులు నిలిపివేసింది. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే ద్వారా ప్రజలు కరెంట్ బిల్లులు చెల్లించాక.. ఆ డబ్బు విద్యుత్ సంస్థకు అందడంలో జాప్యం జరుగుతుండడంతో ఇలాంటి చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. విద్యుత్‌శాఖ యాప్ లేక వెబ్‌సైట్‌లో చెల్లిస్తే నేరుగా ఆ డబ్బు సంస్థకు చేరేలా రూపకల్పన చేసినట్లు చెబుతున్నారు.

అవగాహన కరువు..

వివిధ కారణాలతో ఆర్బీఐ తీసుకొచ్చిన నిబంధన కారణంగా చాలా మంది వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. కొత్తగా విద్యుత్ శాఖ తీసుకొచ్చిన సౌకర్యంపై ఇప్పటివరకూ ప్రజలకు అవగాహన లేదు. ఆ శాఖ సిబ్బంది కూడా చైతన్యం తీసుకురాలేదు. ఇప్పటికైనా స్పందించి ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి



ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్‌ల్లో సులువుగా విద్యుత్ బిల్లులను చెల్లించేవాళ్లం. ప్రస్తుతం వాటి ద్వారా చెల్లింపులు నిలుపుదల చేయడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఇకపై విద్యుత్ శాఖకు సంబంధించిన యాప్‌లో గానీ వెబ్‌సైట్‌లో గానీ చెల్లించాలనే నిబంధన విధించినట్లు తెలిసింది. దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

– చక్రపాణి, అడ్వొకేట్, తాడిపత్రి

తెలియకుంటే నష్టమే



ఆర్బీఐ కొత్త నిబంధన ప్రజలకు తెలియదు. అధికారులు కూడా తెలియజేయలేదు. యాప్‌ల ద్వారా ప్రతి నెలా మాదిరిగా విద్యుత్ బిల్లులను చెల్లిస్తే సరిపోతుందనుకుంటున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించలేక పోతే గడువు మీరిందంటూ జరిమానా రూపంలో అదనంగా చెల్లించి నష్టపోవాల్సి ఉంటుంది.

– కుమారస్వామి, తాడిపత్రి

ప్రజలు సహకరించాలి

విద్యుత్‌శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలి. జూలై ఒకటి నుంచి ఫోన్‌పే, గూగూల్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపివేశాం. ప్రజలు ఈ విషయంలో సహకరించాలి.

– నరసింహులు, విద్యుత్ శాఖ ఏఈ, తాడిపత్రి

బాల్య వివాహాలను ప్రోత్సహించినా శిక్ష



కేజీబీవీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఓ నిదియాదేవి

రాయదుర్గం (డీ హీరేహాళ్): బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారికీ శిక్ష తప్పదని జెడ్పీ సీఈఓ, ఎస్ఎస్ఏ ఇన్‌చార్జ్ పీఓ నిదియాదేవి అన్నారు. బుధవారం డీ హీరేహాళ్ మండలంలోని కేజీబీవీలో నిర్వహించిన 'బాల్య వివాహాలు–అనర్థాలు' అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. నేరం రుజువైతే రెండేళ్ల జైలు, రూ.2 లక్షల జరిమానా విధిస్తారన్నారు. బాలికలకు పుస్తెల బంధం కాకుండా, పుస్తకాలతో బంధం ఉన్నప్పుడే భవిత బంగారుమయం అవుతుందన్నారు. చదువే తనను ఈ స్థాయికి చేర్చిందని, తనతో సమానంగా ప్రతి విద్యార్థినీ ఎదగాలని ఆకాంక్షించారు. చిన్నతనంలోనే వివాహాల వల్ల శారీరకంగా, మానసికంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రాయదుర్గం సీడీపీఓ ప్రభావతి మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారం ఇస్తే అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరి, జెడ్పీ మహిళా శిశు సంక్షేమ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ హసీనాబాను, సర్పంచ్ లక్ష్మి, ఎంపీడీఓ రఘునాథ్, తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

అనంతపురం అర్బన్: జిల్లాలోని మాజీ సైనికులు, సైనిక వితంతువులు, సైనికుల సంక్షేమానికి కృషి చేస్తామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సైనిక్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు ఎకరాల అసైన్డ్ భూమి కేటాయింపు, గన్ లైసెన్స్‌ల జారీ, కేంద్రియ సైనిక్ బోర్డ్, గ్రాంట్లు, పెన్షన్, గుర్తింపు కార్డుల జారీ, ఆర్మీ క్యాంటీన్ కార్డులు, ఈసీహెచ్ఎస్ తదితర సంక్షేమ పథకాలు పక్కాగా అమలు కావాలన్నారు. అసైన్డ్ భూమి కోసం 44 మంది మాజీ సైనికులు దరఖాస్తు చేసుకోగా, వాటిని ఆయా తహసీల్దార్లకు పంపించి నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించామన్నారు. మాజీ సైనికుల హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ ధరతో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని చెప్పారు. మాజీ సైనికులు, సైనిక్ వితంతువుల కోసం ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, బ్యాంకుల్లో సెక్యూరిటీ, ఇతర క్లరికల్ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహించాలన్నారు. వారి పిల్లల విద్యార్హత మేరకు జాబ్‌మేళా, బ్యాంకు రుణ మేళా నిర్వహణతో పాటు ఇతర సేవల కోసం అవుట్ రీచ్ సమ్మిళిత కార్యక్రమం చేపట్టాలన్నారు. సమావేశంలో సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, బోర్డు వైస్ చైర్మన్ కెప్టెన్ నారాయణప్ప, సభ్యులు ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, పరిశ్రమల శాఖ అధికారి నాగరాజరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో కమిషనర్ మేఘ స్వరూప్

కోర్టు ధిక్కరణ కేసులపై దృష్టి సారించండి

కోర్టు ధిక్కరణ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి ప్రభుత్వశాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు కోర్టు ధిక్కరణ వరకూ వెళ్లకూడదన్నారు. కోర్టు ఆదేశాలిచ్చినపుడు వాటిని అమలు చేయడమో లేక కౌంటర్ దాఖలు చేయడమో జరగాలన్నారు. లేకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ధిక్కరణ కేసులు కోర్టులో నమోదైన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఓబుళరెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీటీసీ వీర్రాజు, గనుల శాఖ డీడీ నాగయ్య, డీఎండబ్ల్యూఓ రామ సుబ్బారెడ్డి, బీసీ సంక్షేమశాఖాధికారి కుష్బూ కొఠారి, డీసీఓ అరుణకుమారి, డీఎస్ఓ శోభా రాణి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

66 ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతి

- 8 కళాశాలల్లో సీట్ల కోత.. 4 కళాశాలలు మూసివేత
- జేఎన్‌టీయూ పరిధిలో ఇంజినీరింగ్, ఫార్మసీ సీట్ల ఖరారు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో 2024–25 విద్యా సంవత్సరంలో 66 ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతి లభించింది. రెండు ఇంజినీరింగ్ కళాశాలలు కొత్తగా మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం వర్సిటీ అకడమిక్ స్టాండింగ్ కౌన్సిల్‌లో ఆమోదించారు. జేఎన్‌టీయూ పరిధిలో మొత్తం 43 వేల ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. వీటితో పాటు అదనంగా 4 వేల కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్ సీట్లు అందుబాటులోకి తెచ్చారు. కోర్ బ్రాంచుల్లో సగం సీట్లు కూడా భర్తీ అయ్యే పరిస్థితి లేదని,కంప్యూటర్ సైన్సెస్ సీట్లు అదనంగా కావాలని కోరడంతో ఈ మేరకు అనుమతి ఇచ్చారు. ఇంజినీరింగ్ బ్రాంచుల్లో సీట్ల పరిమితిపై ఉన్న ఆంక్షలను ఇప్పటికే ఏఐసీటీఈ ఎత్తివేయడంతో ఇదే అదునుగా కళాశాల యాజమాన్యాలు ఎక్కువ సీట్లు కావాలని కోరినట్లు తెలిసింది.

8 ఇంజినీరింగ్ కళాశాలలకు షాక్..

ఇక.. వర్సిటీ పరిధిలోని 8 ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల కోత విధించారు. ఇందులో అనంతపురంలోనే రెండు కళాశాలలు ఉండడం గమనార్హం. వాస్తవానికి ఈ 8 కళాశాలల అనుమతిని గతంలో రద్దు చేశారు. అయితే ఆయా కళాశాలల యాజమాన్యాలు వివిధ రకాలుగా ఒత్తిడి తీసుకురావడంతో సీట్ల కోత విధించి అనుబంధ హోదా మంజూరు చేసినట్లు తెలిసింది. అనంతపురంలో రెండింటితో పాటు చిత్తూరు జిల్లాలో ఒకటి, నెల్లూరు జిల్లాలో రెండు, వైఎస్సార్ జిల్లాలో ఒకటి, అన్నమయ్య జిల్లాలో రెండు ఇంజినీరింగ్ కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇదిలా ఉండగా, నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు తమకు అనుబంధ హోదా వద్దని అడ్మిషన్లకు అనుమతి తీసుకోలేదు. ఈ మేరకు సీట్లను ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు.



జేఎన్‌టీయూ పాలక భవనం

మృత్యువులోనూ వీడని 'బంధం'

- రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి
- తాడిపత్రిలో విషాదం

తాడిపత్రి రూరల్: పేరుకు అన్నదమ్ములైనా స్నేహితుల్లా కలిసి ఉండేవారు. ఎక్కడికైనా కలిసే వెళ్లేవారు. వేర్వేరు వృత్తుల్లో స్థిరపడినా ఒకరికి ఒకరు చేదోడువాదోడుగా ఉండేవారు. అలాంటి వారిపై విధికి కన్నుకుట్టింది. ఒకే సారి ఇద్దరి ప్రాణాలు బలిగొంది. రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి చెందిన ఘటన మండలంలోని అర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపిన మేరకు.. తాడిపత్రి పట్టణంలోని గాంధీనగర్‌లో నివసించే లారీ డ్రైవర్ అక్బర్, మెకానిక్ జాకీర్ అన్నదమ్ములు. అక్బర్‌కు భార్య అఫ్రిన్, పిల్లలు అర్షియా, సుబహాన్ ఉండగా, జాకీర్‌కు భార్య నబీనా, పిల్లలు సుహాల్, సుమీరా ఉన్నారు. వివిధ కారణాలతో రోడ్డుపై ఆగిపోయే వాహనాలకు మరమ్మతులు చేసేందుకు జాకీర్ వెళ్లేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి అర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో ఓ లారీకి మరమ్మతులు చేసేందుకు అన్న అక్బర్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పని పూర్తయిన అనంతరం తిరిగి వస్తూ.. మార్గమధ్యంలో రోడ్డు పనుల కారణంగా ఉంచిన డైవర్షన్ బోర్డును బలంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో అక్బర్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన జాకీర్‌ను స్థానికులు మొదట తాడిపత్రి ఆస్పత్రికి, అనంతరం అనంతపురానికి తరలించారు. చికిత్స ఫలించక జాకీర్ కూడా ప్రాణాలు విడిచారు. ఇంటి పెద్దల మృతితో కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. అంత్యక్రియలకు సైతం డబ్బులేని దీనావస్థలో ఉన్న వారికి పలువురు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన అక్బర్, జాకీర్

బాలుడిని బలిగొన్న కోడికూర

కంబదూరు: కలుషితమైన కోడి కూర తిని బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని అచ్చంపల్లిలో జరిగింది. వివరాలు.. అచ్చంపల్లికి చెందిన శ్రీనివాసులు, శ్రీలక్ష్మి దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. మంగళవారం గ్రామంలో పెద్దమ్మ జాతరను పురస్కరించుకుని ఓ దుకాణం వద్ద శ్రీనివాసులు చికెన్ తీసుకెళ్లారు. ఇంట్లో కూర వండి పిల్లలతో కలిసి తిన్నారు. ఈ క్రమంలోనే రెండో కుమారుడు పెద్ద ముత్యాలప్ప (3)కు వాంతులు, విరేచనాలయ్యాయి. బుధవారం ఉదయం బాలుడిని కంబదూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ యుగంధర్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కలుషితాహారం తినడంతోనే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. గ్రామంలో మరో 9 మంది కూడా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇద్దరిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కలుషిత ఆహారం ప్రమాదకరం..

బాలుడి మృతితో అచ్చంపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీఐఓ మాట్లాడుతూ కలుషిత ఆహారం ప్రమాదకరమన్నారు.

పసికందులకు మెరుగైన వైద్యం అందించాలి

అనంతపురం మెడికల్: పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి ప్రారంభదశలోనే సరైన వైద్య చికిత్సలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా శిశువుల్లో పుట్టుకతో వచ్చే లోపాలకు అందించే చికిత్సపై బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ తల నుంచి పాదం వరకూ చేసే పరీక్ష విధానాలు వివరించారు. ఈ క్రమంలో నవజాత శిశువు మొదలు కాలేజీ విద్యార్థుల వరకూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పోషకాహారం అందక పెరుగుదలలో లోపాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లలు, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, మెల్ల కన్ను, గ్రహణమొర్రి, వంకర పాదాలు, కంటి శుక్లాలు, వినికిడి లోపం, గుండె సంబంధిత వ్యాధులు, వివిధ రకాల అంటు వ్యాధులను గుర్తించి సత్వర వైద్యం అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయలేని వారికి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని త్వరిత చికిత్స కేంద్రానికి రెఫర్ చేయాలన్నారు. వినికిడి లోపం, మెల్లకన్ను, కంటి రెటీనా, పెదవి, నోరు, గుండె పనితీరులో లోపం వంటి పిల్లలకు దాదాపు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఉచితంగా చికిత్స అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.నారాయణస్వామి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీవిద్య, మెడికల్ ఆఫీసర్ మల్లీశ్వరి తదితరులున్నారు.

నాటి వర్షం.. నేటికీ పచ్చదనం

గతంలో కురిసిన భారీ వర్షాలకు నేటికీ నీటి లభ్యత తరగలేదు. ఒకప్పుడు నీటి బొట్టు కోసం విలవిలలాడిన మెట్ట భూములు సైతం నేడు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవడంతో భూగర్భ జలాలు ఉప్పొంగాయి. శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాలోని పంట పొలాలు పచ్చని చీరను సింగారించుకున్నట్లుగా కనిపిస్తున్నాయి. బోరుబావుల్లో సమృద్ధిగా నీరు లభ్యమవుతుండడంతో మెట్ట భూముల్లో ఉద్యాన పంటల సాగు ఊపందుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



ముచ్చుకోట వద్ద విరబూసిన బంతి పూలు



పెద్దపప్పూరు మండలంలో బోరుబావుల కింద సాగు చేస్తున్న మొక్కజొన్న పంట, అరటి పంటలో అంతర సేద్యం చేస్తున్న రైతులు

క్లుప్తంగా

జిల్లా పోలీసు మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడిగా ఎన్నికైన గోపీకృష్ణ

అనంతపురం: ఏపీ పోలీస్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా బి. గోపీకృష్ణ, ఉపాధ్యక్షులుగా వైవీ రమణ, జంషీదాభాను, ముఖ్య కార్యదర్శిగా ఎం.శివకుమార్, జాయింట్ సెక్రెటరీగా ఎం.సుధారాణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పి.వాణి, ట్రెజరర్‌గా ఎ.సతీష్‌కుమార్, ఈసీ సభ్యులుగా సత్యవతి, స్రవంతిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఇద్దరి కిడ్నాప్... వెంబడించి పట్టుకున్న పోలీసులు

కనగానపల్లి: ఇద్దరు వ్యక్తులను అపహరించుకెళుతున్న దుండగులను కనగానపల్లి పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపిన మేరకు... నెమలివరం గ్రామానికి చెందిన బొమ్మలాట హనుమంతరాయుడు, నరసింహులు బుధవారం సాయంత్రం యల్లకుంట్ల క్రాస్‌లో ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో ఇన్నోవా వాహనంలో వచ్చిన కొందరు వెనుక నుంచి ఢీకొన్నారు. అనంతరం ఓ బాలిక అదృశ్యమైన అంశంలో వారికి సంబంధం ఉందంటూ వాగ్వాదానికి దిగి బలవంతంగా కారులో ఎక్కించుకుని అనంతపురం వైపుగా బయలుదేరారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఇన్నోవా కారును వెంబడిస్తూ కొండపల్లి వద్ద అడ్డుకున్నారు. కిడ్నాపర్ల చెర నుంచి ఇద్దరిని కాపాడారు. దాడిలో తీవ్రంగా గాయపడిన హనుమంతరాయుడిని ఆస్పత్రికి తరలించారు. కిడ్నాప్‌నకు పాల్పడిన వారిని అనంతపురానికి చెందిన సి.నాగభూషణ, ఎం.సాయికుమార్, ఎస్.మనోహర్, బి.నారాయణస్వామి, రాఘవేంద్ర, బోయ దిలీప్‌కుమార్‌గా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు విరామం

- ఆగస్టు 31 అర్ధరాత్రి వరకూ నిషేధం
- నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు
- రెండు నెలల పాటు ఉపాధి కోల్పోనున్న మత్స్యకారులు



రాయదుర్గం: జిల్లాలోని పెనకచెర్ల డ్యాం, పేరూరు అప్పర్ పెన్నార్ రిజర్వాయర్, బీటీ ప్రాజెక్ట్‌లో చేపల వేటను నిషేధించారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు 31 అర్ధరాత్రి వరకూ చేపల వేటకు విరామం ప్రకటిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. దీంతో 61 రోజుల పాటు జాలర్లు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాల్సి వస్తోంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విరామ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రిజర్వాయర్లలో చేపల వేట సాగిస్తే సంబంధిత జాలర్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు ఇప్పటికే అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలు అతిక్రమించిన మత్స్యకారుల లైసెన్స్‌ల రద్దుతో పాటు ఏపీ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994, సెక్షన్ (4) కింద వలలు, బోట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ మొత్తంలో జరిమానా విధిస్తారు. అలాగే ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీలు, సౌకర్యాలను నిలుపుదల చేస్తారు.

ఏటా రూ.కోట్లలో లావాదేవీలు

గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల వద్ద ఉన్న మిడ్ పెన్నార్ డ్యాం, రామగిరి మండలం పేరూరు సమీపంలోని అప్పర్ పెన్నార్ డ్యాంతో పాటు భైరవానితిప్ప ప్రాజెక్ట్‌లో చేపల పెంపకాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టింది. ఏటా ఈ మూడు రిజర్వాయర్లలో చేపల వేట ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరుగుతుంటాయి. గతేడాది మిడ్ పెన్నార్ డ్యాంలో 8 లక్షలు, పేరూరులో 10 లక్షలు, బీటీపీలో 6.50 లక్షల చేప పిల్లలను వంద శాతం రాయితీతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుత సీజన్‌లో చేపల ఉత్పత్తి ఆశాజనకంగా ఉంది. ఒక్కో చేప కిలో నుంచి ఐదు కిలోల బరువుకు పెరిగాయి. ఇప్పటి వరకూ సాగించిన చేపల వేట ద్వారా గత సీజన్‌తో పోల్చుకుంటే పది శాతం మేర అదనపు ఆదాయం సమకూరింది.

ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు

ప్రస్తుతం మిడ్ పెన్నార్ డ్యాంలో 100, పేరూరులో 120, బీటీపీలో 75 టన్నుల దిగుబడి చేతి అందే అవకాశం ఉందని అధికారులు ప్రాథమిక అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధన మేరకు కిలో రూ.100తో విక్రయించినా రూ.2.95 కోట్ల ఆదాయం మత్స్యకారులకు సమకూరుతుంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంతో చేపల వేటపై ఆధారపడిన మత్స్యకారులు దాదాపు రెండు నెలల పాటు ఉపాధి కోల్పోయారు. మూడు రిజర్వాయర్ల పరిధిలో లైసెన్స్ కలిగిన మత్స్యకారులు 750 మంది ఉండగా, పరోక్షంగా వేలాది మంది జాలర్లు ఉపాధి పొందుతున్నారు. చేపల వేట నిషేధం ప్రకటించిన సమయంలో మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం గమనార్హం.

ప్రభుత్వం ఆదుకోవాలి



చేపల వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకు పనులేవి ఉండవు. కుటుంబ పోషణతో పాటు ఈ రెండు నెలలూ ఆర్థిక కష్టాలు వెన్నాడుతాయి. వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. వేట నిషేధిత సమయంలో కోస్తా ప్రాంతంలో అమల్లో ఉండేలా పరిహారాన్ని రాయలసీమ ప్రాంత మత్స్యకారులకూ వర్తింపజేయాలి.

– లోకప్ప, మత్స్యకారుడు, తాళ్లకెర

రిజర్వాయర్లలోకి అనుమతించేది లేదు



ప్రభుత్వ నిబంధన మేరకు ఆగస్టు 31 వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వాయర్లలో చేపలు పట్టేందుకు అనుమతించేది లేదు. ఈ విషయంపై ముందుగానే జాలర్లను హెచ్చరించాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆయా రిజర్వాయర్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

– లక్ష్మీనారాయణ, ఎఫ్‌డీఓ, బీటీపీ

రాయదుర్గంలో చిరుత సంచారం

రాయదుర్గం టౌన్: స్థానిక మారెమ్మ గుడి ప్రాంతంలోని నర్సోజీ కుంట వద్ద ఓ చిరుత సంచరించింది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కొండ వైపు నుంచి వచ్చిన చిరుత ముళ్లపొదల వద్ద తచ్చాడుతూ స్థానికుల కంటబడింది. ఆ ప్రాంతంలో పశువుల పాక, గొర్రెలు ఎక్కువగా ఉండడంతో వాటి కోసం చిరుత వచ్చి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే కుక్కలు ఏకబిగిన మొరుగుతుండడంతో ఇళ్లలో నుంచి స్థానికులు బయటకు వచ్చారు. అదే సమయంలో చిరుత ముళ్లపొదలను దాటుకుని పరుగు తీసింది. విషయాన్ని గమనించిన స్థానిక రైతు గంగాధర్, మరికొందరు టార్చిలైట్లు తీసుకుని చిరుత కోసం గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో విషయాన్ని అటవీ శాఖ అధికారులకు చేరవేశారు.

ప్రతి విద్యార్థికీ మంచి విద్య అందించాలి : డీఈఓ


ఎంఈఓలు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

ఆత్మకూరు: ఓ మనిషి ఉన్నత స్థానానికి ఎదిగాడంటే దాని వెనుక ఓ ఉపాధ్యాయుడి కృషి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి విద్యార్థికీ మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు డీఈఓ వరలక్ష్మి సూచించారు. బుధవారం ఆత్మకూరులోని సౌత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకుల నాణ్యత, భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థుల చేరికతో పాటు హాజరు శాతాన్ని కూడా పెంచాలన్నారు. విద్యా సామగ్రి పంపిణీపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడండి : డీఎంఓ

అనంతపురం మెడికల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) ఓబులు ఆదేశించారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. జ్వర లక్షణాలు ఉన్న వారికి రక్తపూత పరీక్ష తప్పకుండా చేసి, వైద్యాధికారికి నివేదిక సమర్పించాలన్నారు. ల్యాబ్ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ... క్షేత్రస్థాయి సిబ్బంది అందించే రక్తపూతల పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. రక్తపూతల వారంతపు రిపోర్టును జిల్లా కార్యాలయానికి తప్పనిసరిగా పంపాలన్నారు. కార్యక్రమంలో మలేరియా కార్యాలయ సిబ్బంది గిరిధర్ రెడ్డి, రమేష్, రాఘవరెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పట్టు'కుంటే కాసుల వర్షమే

- సెరికల్చర్ అధికారి ఓబులేసు
- మల్బరీ సాగుపై రైతులకు అవగాహన


మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఓ ఓబులేసు

అనంతపురం అగ్రికల్చర్: మల్బరీ (రేషం) సాగుతో కాసుల వర్షం కురుస్తుందని రైతులకు సెరికల్చర్ అధికారి (ఎస్ఓ) ఓబులేసు సూచించారు. మల్బరీ సాగు విధానాలపై రైతులకు విరివిగా అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన కొందరు రైతులను కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి తీసుకెళ్లి అక్కడ పట్టు సాగు చేపట్టిన అభ్యుదయ రైతుల అనుభవాలు, లాభనష్టాలపై అవగాహన కల్పించారు. మల్బరీ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రోత్సాహక రాయితీలు ఇస్తుండడంతో రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఒక ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగు చేస్తే రైతులకు రూ.22,500 ప్రోత్సాహకం అందుతుందన్నారు. అదే ఎస్సీ, ఎస్టీ రైతులకైతే రూ.27 వేలు ఇస్తామన్నారు. గరిష్టంగా ఐదు ఎకరాలకు ప్రోత్సాహకం వర్తిస్తుందన్నారు. పట్టు పురుగులు పెంపకానికి 20/50/16 కొలతలు కలిగిన పెద్ద షెడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు, అదే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.3.60 లక్షలు ఇస్తామన్నారు. 20/30/16 కొలతలు కలిగిన చిన్న షెడ్డు నిర్మాణానికి రూ.2.25 లక్షలు కాగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.2.75 లక్షలు మంజూరవుతుందని వివరించారు. సూట్ రేరింగ్ స్టాండ్‌కు, నేత్రికలు (ప్లాస్టిక్ చంద్రికలు) ఇతర మందులకు కూడా ప్రోత్సాహక రాయితీలు ఉంటాయన్నారు. మార్కెట్‌లో బైవోల్టీన్ గూళ్లు విక్రయిస్తే కిలోకు రూ.50 చొప్పున ఇన్సెంటివ్ ఉంటుందన్నారు. అంతేకాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టు రైతులకు వర్తింపజేశారని, ఇది రైతులకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. మార్కెట్‌లో ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నందున మల్బరీకి మించిన లాభదాయకమైన పంట మరొకటి లేదన్నారు. తోటలో పంటను రెండు భాగాలుగా చేసుకుని సంవత్సరానికి సులభంగా 10 పంటలు పండించవచ్చన్నారు.

హతమార్చి.. గుండెపోటుగా చిత్రీకరించి!

- విద్యుత్ శాఖ ఉద్యోగి మృతి కేసులో వీడిన మిస్టరీ
- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన వాస్తవాలు
- నిందితుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: నాలుగు రోజుల క్రితం గుంతకల్లులో చోటు చేసుకున్న విద్యుత్ శాఖ ఉద్యోగి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. కలకాలం తోడుండే భర్త కన్నా ప్రియుడే గొప్పనుకుంది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి ప్రియుడితో కలసి భర్తను హతమార్చింది. వాస్తవాలు బహిర్గతం కావడంతో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య వెల్లడించారు. గుంతకల్లులోని రామిరెడ్డి కాలనీకి చెందిన దాసరి ఆంజనేయులు విద్యుత్ శాఖ ఏఏఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండేవాడు. ఆరేళ్ల క్రితం ఆయనకు ఆదోనికి చెందిన కావేరితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా ఆదోనికి చెందిన పింజారి పీరాన్‌బాషాతో కావేరికి ఉన్న పరిచయం కాస్త వివాహేతర సంబంధంగా మారింది. ఈ క్రమంలో శాశ్వతంగా పీరాన్ బాషాతోనే ఉండిపోవాలని భావించిన కావేరి... ఇందుకు భర్త అడ్డుగా ఉండడంతో ఎలాగైనా ఆయనను కడతేర్చాలని ప్రియుడితో కలసి పథకం వేసింది. ఇందులో భాగంగానే జూన్ 29న రాత్రి 10:15 గంటలకు మద్యం సేవించి నిద్రమత్తులో ఉన్న ఆంజనేయులు ముఖంపై దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. మరుసటి రోజు ఉదయం తన భర్త గుండెపోటుతో మృతి చెందినట్లు అందరినీ కావేరి నమ్మించింది. మృతదేహాన్ని పరిశీలించిన ఆంజనేయులు సోదరుడు దాసరి గాదిలింగ అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కావేరి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమెను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వాస్తవాలు వెలుగు చూశాయి. దీంతో బుధవారం కావేరితో పాటు పింజారి పీరాన్‌బాషానూ అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అనంతపురం రూరల్: టెట్‌లో అర్హత సాధించి డీఎస్సీ (ఎస్జీటీ, ఎస్ఏ)కి సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేయనున్నారు. ఈ మేరకు బీసీ స్టడీ సర్కిల్ ఉప సంచాలకులు కుష్బూకొఠారి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. టెట్ మార్కుల ఆధారంగా 200 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ఈ నెల 11 నుంచి బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ సమయంలో స్టయిపండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారు. పూర్తి వివరాలకు 08554 275575లో సంప్రదించవచ్చు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు నాగరాజు

రాయదుర్గం టౌన్: స్థానిక బైపాస్ రోడ్డు ముత్తరాసి కాలనీ సమీపంలోని కురాకులగుట్టపై ఓ వ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం వెలుగుచూసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని బ్రహ్మసముద్రం మండలం ఎరిడికెరకు చెందిన ఎస్.నాగరాజు(63)గా నిర్ధారించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న నాగరాజు... పొలం పనులకు అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసేందుకు మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై రాయదుర్గానికి వెళ్లాడని తెలిపారు. రాత్రి ఇంటికి రాకపోవడంతో గాలింపు చేపట్టిన బంధువులు బుధవారం ఉదయం ముత్తరాసి కాలనీ బైపాస్ రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. అక్కడికి సమీపంలోనే పరమేశ్వరప్ప ఆలయం ఎదురుగా గుట్టపై మృతదేహం కనిపించింది. మద్యం మత్తులో గుట్టపై బహిర్భూమికి వెళ్లి గుండెపోటుకు గురై మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, నాగరాజు మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

జాతీయ ఉత్తమ టీచర్ అవార్డుకు దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2024 కోసం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల టీచర్లు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కనీసం పదేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ పొందుపరిచిన మార్గదర్శకాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మ్యానువల్ దరఖాస్తులు పరిశీలించరని, ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అనంతరం హార్డ్‌కాపీలను ఈనెల 15లోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో గురువారం జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్షలను మళ్లీ ఎప్పుడు నిర్వహించనున్నామో తెలిపే షెడ్యూల్‌ను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

వజ్రకరూరులో చోరీ

వజ్రకరూరు: మండల కేంద్రంలో నివాసముంటున్న టపాల్ సత్తార్ సాహెబ్ ఇంట్లో దుండగులు చొరబడి నగదు అపహరించుకెళ్లారు. వ్యక్తిగత పనిపై వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఆయన మరో ప్రాంతానికి వెళ్లారు. బుధవారం తిరిగి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళాలు బద్దలుగొట్టి ఉండడం గమనించిన ఆయన లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువా ధ్వంసం చేసి అందులోని రూ.2 లక్షల నగదు అపహరించుకెళ్లినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ నరేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా రాధారమాదేవి



అనంతపురం సిటీ: జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా కె.రాధారమాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఆమెకు కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇప్పటి వరకూ సహాయ కమిషనర్‌గా పని చేసిన రఘురామ గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే.

పూర్తి స్థాయి నగదు రహిత వైద్య సదుపాయం కల్పించండి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తిస్థాయి నగదు రహిత వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌కు నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి శేషపణి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలో మంత్రిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. కరణం హరికృష్ణ మాట్లాడుతూ... 'ఉద్యోగుల ఆరోగ్య పథకం' పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు ఉచితంగా అందించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ గరిష్ట సీలింగ్‌ను తొలగించాలని కోరారు. ఈహెచ్ఎస్ అమలు కాని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎంతైతే వ్యయం జరుగుతుందో అంత మొత్తాన్ని ప్రభుత్వమే భరించేలా చూడాలని విన్నవించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు నిర్దిష్ట కాలవ్యవధిలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. సంవత్సరానికోసారి జరగాల్సిన 'మాస్టర్ చెకప్'ను పటిష్టంగా అమలు జరిగేలా చూడాలన్నారు. వైద్య చికిత్సకు సంబంధించిన స్లాబ్‌లను ప్రస్తుతం స్లాబ్‌లకు అనుగుణంగా ఆధునీకరించాలని లేకపోతే పరిధిని పెంచాలని విన్నవించారు. సమయానికి పరిమితం చేయకుండా 24 గంటలు ఈహెచ్ఎస్ సేవలు కొనసాగించేలా చూడాలన్నారు. నగదు రహిత వైద్యం గరిష్ట పరిమితి రూ. 25 లక్షలు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

బీఎస్ఎఫ్ విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య


ధనుంజయ (ఫైల్)

వజ్రకరూరు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక బీఎస్ఎఫ్ విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన ఉప్పర ధనుంజయ (56) బీఎస్ఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2013లో ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి తనకున్న నాలుగు ఎకరాల్లో పంటల సాగు చేపట్టారు. ఈ క్రమంలోనే గత ఏడాది పంటల సాగుకు రూ. 9 లక్షల వరకూ అప్పులు చేశారు. అయితే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడులు సైతం చేతికి అందలేదు. దీంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయి. దీనికి తోడు అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన బుధవారం మధ్యాహ్నం ఇంటి ఆవరణలో ఉన్న పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య శంకరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ కార్యకర్తల దాడి

- తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలైన బాధితుడు


చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహేష్

శెట్టూరు: మండలంలోని ఎర్రబోరేపల్లిలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిజన మహేష్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. వివరాలు... సొంత పనిపై మంగళవారం కళ్యాణదుర్గం వెళ్లిన మహేష్ అదే రోజు రాత్రి ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో దుస్తులు మార్చుకుంటుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు 8 మంది మూకుమ్మడిగా దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు ఎం.ఎస్.రాయుడు, తెనగల్లు లింగప్ప, వెంకటరమణ, రామలింగారెడ్డి తదితరులు బుధవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. టీడీపీ కార్యకర్తల దాడిని ఖండించారు. కాగా, ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు.

అపరిశుభ్రతా నిలయం!



ఆసుపత్రిలో కంపుకొడుతున్న మరుగుదొడ్డి



అపరిశుభ్రంగా ఉన్న చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశం



మూతపడిన రక్తపరీక్షల గది

- అధ్వానంగా పీహెచ్‌సీ, పరిసరాలు
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- రాత్రి సమయాల్లో అందుబాటులో లేని డాక్టర్లు

ఆత్మకూరు: ప్రస్తుతం ఎటు చూసినా డయేరియాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డయేరియా వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అటు అధికారులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే స్థానిక పీహెచ్‌సీ నిర్వహణ అధ్వానంగా మారడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని చుట్టూపక్కన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున గర్భిణులు, రోగులు వస్తుంటారు. ఆసుపత్రిలో ఎటు చూసినా అపరిశుభ్రంగా ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని చెబుతున్నా అధికారులు ఆస్పత్రి పరిశుభ్రత గురించి పట్టించుకోకపోతే ఎలా అంటూ రోగులు, స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఎటుచూసినా అపరిశుభ్రతే..

ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కడ చూసినా దుర్వాసన, అపరిశుభ్రతే కనిపిస్తోంది. మరుగుదొడ్లోకి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్డి వద్ద దుర్వాసన, అపరిశుభ్రంగా ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఆసుపత్రి లోపలికి వెళ్లే చోట నిరంతరం నీరు వృథా అవుతుండటంతో అక్కడ, దోమలు అపరిశుభ్రత అధికంగా ఉంటోంది. ఆసుపత్రిలో ఒక్కోసారి రోగులు తాగడానికి నీరు కూడా లేక ఇబ్బందులు పడే పరిస్థితులు ఉయి. ఆసుపత్రిలో స్వీపర్లు లేకపోవడంతో ఆసుపత్రిని శుభ్రం చేసేవారు కరువయ్యారు. ప్రస్తుతం అక్కడి చెత్త చెదారం వైద్య సిబ్బందే శుభ్రం చేసుకుంటున్నట్లు సమాచారం.

సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు..

వైద్య సిబ్బంది కొరతతో వేధిస్తోంది. గతంలో నలుగురు డాక్టర్లు ఉండగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. అంతేకాకుండా ఆసుపత్రిలో ఎక్కువగా గర్భిణులు వస్తుంటారు. రక్త పరీక్షలకు సంబంధించి సిబ్బంది ఒక్కరు మ్రాతమే ఉన్నారు. దీంతో ఉన్న ఒక్కరూ జిల్లా కేంద్రంలో మీటింగ్ ఉన్నా, లేదా సెలవుపై వెళ్లినా రక్త పరీక్షల గది మూతవేసే పరిస్థితి ఏర్పడింది. ఇక రాత్రి సమయాల్లో ఏదైనా అత్యసర పరిస్థితి అయితే డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం స్టాఫ్‌నర్సులు ఉండి వైద్యం అందిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వైద్యుల కొరత లేకుండా చేయాలని స్థానికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

> **రోగులకు ఇబ్బందులు రానివ్వం**
>
> ఆస్పత్రిలో రోగులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రిలో పని చేస్తున్న స్వీపర్ సెలవుపై వెళ్లింది. రాత్రి సమయాల్లో ఒక్కో డాక్టర్ షిఫ్టుల ప్రకారం పని చేస్తున్నారు. ఈ నెల 1వ తేదీకి షిఫ్టులు ముగిశాయి. రాత్రి సమయాల్లో డాక్టర్ అందుబాటులో ఉండేలా చేస్తాం.
>
> – డాక్టర్ సబిహా సుల్తానా, పీహెచ్‌సీ వైద్యాధికారి

పారిశుద్ధ్యం మెరుగునకు అధిక ప్రాధాన్యత

- మేయర్ వసీం



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పాతూరు చెరువుకట్టకు వెళ్లే మార్గం వద్ద చేపడుతున్న పూడికతీత పనులను ఆయన డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలసి పరిశీలించారు. కాలువ శుభ్రం చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో పూడికతీత పనులు చేయిస్తున్నట్లు మేయర్ తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణ కోసం నగరంలో పరిశుభ్రత కార్యక్రమాలను పెంచుతున్నామన్నారు. నగరంలోని ప్రధాన కాలువల్లో అవసరం ఉన్న ప్రాంతాల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా అపరిశుభ్రత ఉంటే వెంటనే పారిశుద్ధ్య సిబ్బంది వెళ్లి తగు చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ పనులు ప్రణాళిక ప్రకారం వివిధ డివిజన్లలో చేపడుతున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లోనూ చైతన్యం కల్పించామన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. చెత్తను డస్ట్‌బిన్లతోపాటు నగరపాలక సంస్థ సిబ్బందికి అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో వ్యవహరించాలన్నారు. మేయర్ వెంట ఈఈ సూర్యనారాయణ, కార్పొరేటర్లు కమల్ భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు సుబ్బయ్య, గంగాధర్, తదితరులున్నారు.

ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

- స్టాండప్ ఇండియా లబ్ధిదారుకు కలెక్టర్ సూచన



కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: స్టాండప్ ఇండియా పథకం ద్వారా మంజూరైన కాంక్రీట్ మిక్సర్ వాహనం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ లబ్ధిదారుకు సూచించారు. స్టాండప్ ఇండియా పథకం కింద రాజమ్మ అనే మహిళకు మంజూరైన కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు విలువ రూ.48 లక్షలు కాగా పథకం కింద వాహనానికి బ్యాంకు రూ.36 లక్షలు రుణం ఇచ్చిందన్నారు. వాహనాన్ని ఇండస్ట్రియల్ పాలసీ 2023–27లో 45 శాతం సబ్సిడీ దాదాపు రూ.21 లక్షలు పెట్టుబడి రాయితీని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. స్టాండప్ ఇండియా పథకం కింద జిల్లాలోని ప్రతి బ్యాంకు ఇద్దరికి (ఒక ఎస్సీ లేదా ఎస్టీ వర్గానికి చెందిన వారికి, ఒక మహిళకు) కచ్చితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎం నర్సింగ్ రావును ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి జి.నాగరాజారావు, బ్యాంకు మేనేజర్ రాహుల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముతవల్లీల రాష్ట్ర అధ్యక్షుడిగా షకీల్‌షఫీ



షకీల్‌షఫీని సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన జామీయా మసీదు ముతవల్లి షకీల్‌షఫీ రాష్ట్ర ముతవల్లీల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక కావడం హర్షణీయమని మైనార్టీ నాయకులన్నారు. ఈ మేరకు బుధవారం అనంత మైనార్టీ నాయకులు ఐఎంఎం బాషా, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సాలార్‌బాషా, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు షబ్బీర్ నాసిర్‌ఖాన్ తదితరులు షకీల్‌షఫీని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా షకీల్‌షఫీ మాట్లాడుతూ మసీదు అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. జిల్లాలోనే కాకుండా అన్నిచోట్ల వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. ప్రార్థనా మందిరాల ద్వారా ఆధ్యాత్మిక సేవలు మరింత అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అనంత వాసికి రాష్ట్రస్థాయి అవకాశం రావడం పట్ల పలువురు సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో కరీముల్లా, నూర్ మహ్మద్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

అంధులకు అండగా అమ్మ సంస్థ



అంధులకు ఆర్థికసాయం, నిత్యావసరాలనందిస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: వారందరూ పుట్టుకతో అంధులు. వివిధ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ ఆర్థికపరిస్థితులు బాగాలేక సతమతమవుతున్నారు. అలాంటి వారికి అమ్మ సంస్థ రమణారెడ్డి రూ. 1 లక్ష సాయమందించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలు..శెట్టూరు మండలానికి చెందిన అంజినప్ప, ఆంథోనప్ప, జానకి, నగరానికి చెందిన ప్రకాష్, రంగయ్యశెట్టి వద్దకు అమ్మ సంస్థ రమణారెడ్డి వెళ్లి నిత్యావసరవస్తువులు, బియ్యం బస్తాలతో పాటూ ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున అందరికి కలిపి రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం అమ్మ సంస్థ కార్యాలయంలో రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్న వారి జీవనోపాధి కోసం సాయమడిగారని వారికి సాయపడడం ఆనందంగా ఉందన్నారు. తమ జీవితాలలో వెలుగులు నింపడానికి ముందుకొచ్చిన రమణారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కణేకల్లు: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ హెచ్చరించారు. కణేకల్లులో బుధవారం ఫర్టిలైజర్‌షాపు యజమానులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏడీఏ ఫర్టిలైజర్‌షాపు యజమానులనుద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన వివిధ రకాల పంట విత్తనాలు, ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. మందుల విక్రయానికి తప్పని సరిగా ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. లైసెన్సులు, ఓ ఫామ్, ఇతరాత్ర ధ్రువీకరణపత్రాలు సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుమతి లేని మందులను విక్రయిస్తే చర్యలు తీసుకోవల్సి వస్తోందన్నారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతిదానికి బిల్లులు తప్పక ఇవ్వాలని ఆదేశించారు.

టెట్ పరీక్ష గడువు పొడిగించాలి



విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టెట్ పరీక్ష గడువు పొడిగించాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఎస్సీ అభ్యర్థులతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ టెట్ నోటిఫికేషన్ విడుదల రోజు నుంచి పరీక్ష రోజువరకు చాలా తక్కువ సమయం ఉందన్నారు. కొత్తగా టెట్ రాయాలనుకున్న వారికి సిలబస్ పూర్తి చేయడం చాలా కష్టమన్నారు. గతంలో టెట్ రాసి మార్కులు తక్కువ వచ్చిన వారు తిరిగి రాసి మార్కులు ఎక్కువ రావాలని ప్రయత్నం చేసే అవకాశం ఉందన్నారు. కనీసం 100 రోజులు సమయం ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యాశాఖ ఏడీ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, నాయకులు నూరుల్లా, టెట్ అభ్యర్థులు చెన్నయ్య, సూరి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మిరప తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్

ఉరవకొండ: మిరప పంటకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో డిజిటల్ గ్రీన్ తరఫున మిరప పంటకు సోకే తెగుళ్లు, మార్కెటింగ్ అవకాశాలపై ఉరవకొండ డివిజన్ ఉద్యానవన శాఖ అధ్వర్యంలో అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన అధికారితో పాటు ఉరవకొండ వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు పద్మజ, ఉద్యాన అధికారి నెట్టికంటయ్య, డిజిటల్ గ్రీన్ ప్రతినిధి యశోద హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ ద్వారా మిరప పంటలో వచ్చు అన్ని రకాల సమస్యలకు రైతులకు ఫోన్ ద్వారా మెసెజ్ పంపుతామన్నారు. చాట్‌బాట్ ద్వారా అక్కడికక్కడే పంటకు సోకిన తెగుళ్ల నివారణకు పరిష్కారం లభిస్తుందన్నారు. ముఖ్యంగా మిరప రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు గురించి ఆర్‌బీకె సిబ్బంది పూర్తి స్థాయిలో వివరించాలన్నారు.

వృద్ధుడి అదృశ్యం



రామచంద్రనాయుడు

రాప్తాడురూరల్: కక్కలపల్లికాలనీ పంచాయతీ నందమూరినగర్‌కు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు...నందమూరినగర్‌కు చెందిన మద్దిపాటి రామచంద్రనాయుడు కుమారుడు రమేష్ నాయుడు వద్ద ఉంటున్నాడు. అప్పుడప్పుడు దైవ దర్శనాల కోసమంటూ వారం పదిరోజుల పాటు ఇంటి నుంచి వెళ్లేవాడు. ఈ క్రమంలో గత నెల 5న సాయంత్రం 6.30 గంటల సమయంలో రామచంద్రనాయుడు ఇంటినుంచి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగిరాలేదు. కుమారుడు పలుచోట్ల వెతికాడు. బంధువులను ఆరా తీశాడు. ఉపయోగం లేకపోయింది. ఈ క్రమంలో బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు రూరల్ సీఐ 94407 96811, ఎస్ఐ 93469 17101 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ రామకృష్ణారెడ్డి కోరారు.

నకిలీ సిగరెట్ల పట్టివేత

అనంతపురం: నగరంలో రూ.10 లక్షలు విలువైన నకిలీ సిగరెట్లను పోలీసులు సీజ్ చేశారు. వన్ టౌన్ సీఐ వి. రెడ్డప్ప తెలిపిన మేరకు.. కన్యకాపరమేశ్వర జనరల్ స్టోర్‌ను నిర్వహిస్తున్న సుధాకర్ అనే వ్యక్తి నకిలీ సిగరెట్లను నిల్వ చేశారు. పక్కా సమాచారంతో నకిలీ సర్టిఫికెట్ల నిల్వ ఉంచిన గోదాముపై దాడి చేశారు. ఈసందర్భంగా సుమారు రూ.10 లక్షలు విలువైన సిగరెట్లను సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఎస్పీ గౌతమి శాలి, సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో నకిలీ సిగరెట్ల విక్రేతలపై ఉక్కుపాదం మోపినట్లు సీఐ పేర్కొన్నారు.

11 నుంచి భాగవత సప్తాహ ఉత్సవాలు

తాడిపత్రి అర్బన్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తాడిపత్రి శాఖ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాల రోడ్డులోని ఎస్‌ఎల్‌ఎన్ వర హాలు గార్డెన్స్‌లో 18వ తేదీ వరకూ ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 11న గురువారం సాయంత్రం అహోబిల రామానుజ జీయర్ స్వామి భాగవత మహత్యం ప్రవచనంతో ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని పులిప్రొద్దుటూరు సమీపంలో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పి రాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. తాడిపత్రి నుంచి స్వగ్రామం యుగుడూరుకు బైక్‌లో వెళ్తుండగా కిందపడటంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం అతడిని అనంతపురానికి తరలించారు.

మద్యం పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 96 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మద్యాన్ని తరలిస్తున్న రాముడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

నగరంలో ఎమ్మెల్యే పర్యటన



రాంనగర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రాంనగర్, లక్ష్మీనగర్, తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నగరంలో ఉన్న పార్కుల్లోనూ పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే వెంట నగరపాలక సంస్థ ఈఈ సూర్యనారాయణ, తదితరులున్నారు.

డిప్లొమా ఇంజినీర్ల సమస్యలపై దృష్టి పెట్టండి



పీఆర్ ఎస్ఈ ప్రసాద్‌ను సన్మానిస్తున్న డిప్లొమా ఇంజినీర్ల అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న డిప్లొమా ఇంజినీర్ల సమస్యలపై దృష్టి సారించాలని డిప్లొమా ఇంజినీర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం డిప్లొమా ఇంజినీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనివాసమూర్తి, జాయింట్ సెక్రటరీ ఎస్ఏ అలీంబాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శి మాధవకృష్ణ, ఫైనాన్స్ సెక్రటరీ సూర్యనారాయణ, డివిజనల్ కార్యాలయ ఏఈఈ కాంచన, ఎస్ఈ కార్యాలయ ఏఈ హుస్సేన్‌బాషా పంచాయతీరాజ్ ఎస్ఈ కేవీకేవీ ప్రసాద్‌ను కలిశారు. ఈసందర్భంగా ఎస్ఈకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్లొమా ఇంజినీర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఈకి వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త తీసుకెళ్లాలి



క్లాప్ ఆటో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించి, కంపోస్టు యార్డులకు తరలించాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు క్లాప్ ఆటో సిబ్బందికి సూచించారు. బుధవారం నగరంలోని హౌసింగ్‌బోర్డు, విజయనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో స్థానికులతో అదనపు కమిషనర్ మాట్లాడారు. చెత్త సేకరణకు రోజూ వాహనాలు వస్తున్నాయా లేదానని ఆరా తీశారు. ప్రజలు సైతం చెత్తను బయట పడేయకుండా క్లాప్ ఆటోలకు అందించాలన్నారు. రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని అదనపు కమిషనర్ ఆదేశించారు.

ఘనంగా సాగు బడి



పూజ చేస్తున్న అర్చకులు

శింగనమల: శింగనమల రంగరాయులు చెరువు కింద రైతులు బుధవారం సాగుబడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దేవాలయాల్లో పూజలు నిర్వహించి, చెరువు వద్ద సాగుబడి కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు బాగా కురిసి, చెరువు నిండాలని కోరుకున్నారు. చెరువు కింద పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రైతులు కాలువల్లో పూడిక తీత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

అక్రమ బియ్యం వ్యాపారుల బైండోవర్

బొమ్మనహాళ్: మండలం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారాన్ని నిర్వహించే వారిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కర్ణాటకలోని బొమ్మదరపల్లి చెందిన సురేష్‌తో పాటు మరో మహిళ అక్రమ రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపణలు రావడంతో వారిని బుధవారం బొమ్మనహాళ్ తహసీల్దార్ రామాంజినమ్మ ముందు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. మరోసారి బియ్యంతో పట్టుబడితే 6 నెలలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా ఉంటుందని హెచ్చరించినట్లు తెలిపారు.

నేడు విద్యాసంస్థల బంద్

అనంతపురం టవర్‌క్లాక్: నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ గురువారం విద్యాసంస్థల బంద్ తలపెట్టినట్లు ఏపీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివ ఓ ప్రకటనలో తెలిపారు. బంద్‌కు విద్యార్థులతోపాటు విద్యాసంస్థలు సహకరించాలని కోరారు.

గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై దృష్టి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ

అనంతపురం సెంట్రల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గర్భిణులు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ పిలుపునిచ్చారు. బుధవారం లక్ష్మీనగర్, రామ్‌నగర్, కోవూర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, సామాజిక వేడుకలు, డయేరియాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, టీటీ ఇంజక్షన్లు, ఐరన్ టాబ్లెట్స్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి వసంతబాబు

ఆత్మకూరు: హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి వసంతబాబు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించడంతోపాటు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. అనంతరం సబ్జెక్టుల వారీగా పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పరమేశ్వర స్వామి ఉన్నారు. ఇదిలా ఉండగా విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత లేకపోవడంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

సౌందర్య లహరిపై ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: జగద్గురు శంకరాచార్యులు రచించిన సౌందర్య లహరిపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంగీత విదూషిమణి గుంటూరు సంధ్యామూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీరమా సమేత శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం వేదికగా ఈనెల 5 నుంచి 15 వరకు శిక్షణాతరగతులుంటాయని పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా శ్రీనృత్యకళానిలయం అందిస్తున్న ఆధ్యాత్మిక సేవల్లో భాగంగా రోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సౌందర్యలహరిలోని వంద శ్లోకాలలో నిత్యం పది చెప్పున రాగయుక్తంగా నేర్పిస్తామని తెలిపారు. సంస్కృత ఉచ్చారణతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం టవర్‌క్లాక్: బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంపై జిల్లా వ్యాప్తంగా కమిటీలు వేస్తున్నామని, ఇందులో భాగంగా శింగనమల నియోజక వర్గ అధ్యక్షుడిగా మిద్దె గణేష్‌ను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ

రాయదుర్గం రూరల్: పట్టణంలోని దాసప్పరోడ్డులో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీఓ అల్లాబకాష్ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఎంఈఓ – 2 వెంకటరమేష్ తో కలిసి బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి మౌలిక వసతుల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం వండుతున్నారా? టెక్స్ట్ పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇచ్చారా? లేదా ? అని ఆరా తీసినట్లు చెప్పారు. అలాగే హాజరు పట్టిక , ఇతర రికార్డులను తనిఖీ చేశామన్నారు.